సాక్షి తిరుపతి

శనివారం । 15 । మార్చి । 2025



ఫలప్రదం.. విని'యోగం'!
వినియోగదారుల చట్టం కొండంత భరోసానిస్తోంది. వినియోగదారులకు అండగా నిలుస్తోంది. - 8లో



గుంతలు బాబోయ్!
జిల్లాలోని గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. గుంతలు తేలి నడవడానికి ఇబ్బందికరంగా తయారయ్యాయి. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
తిరుపతి	6-26	5-00
గూడూరు	6-20	4-57

న్యూస్‌రీల్

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ


గరుడ వాహనంపై ఊరేగుతున్న మలయప్ప

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయాన్ని దర్శించిన సుప్రీంకోర్టు జడ్జి


గుడిమల్లం ఆలయంలో భారత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టి

ఏర్పేడు(రేణిగుంట): భారత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టి శుక్రవారం ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనాలను అందించి ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణశర్మ, అర్చకులు యోగేంద్రపవన్‌కుమార్‌శర్మ, సంతోష్ పాల్గొన్నారు. అలాగే కృష్ణా నది బోర్డు మెంబర్ దివాకర్ రాయపురి గుడిమల్లం పరశురామేశ్వరుని దర్శించుకున్నారు.

బీఈడీ, ఎంబీఏ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో జనవరిలో జరిగిన ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ తొలి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఫిబ్రవరిలో జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను సైతం విడుదల చేసినట్లు తెలియజేశారు. ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎర్రచందనం వేలం, విక్రయాలపై చర్చ



సమావేశమైన నిపుణుల కమిటీ సభ్యులు

తిరుపతి మంగళం : తిరుపతి నగరంలోని మారస సరోవర్ హోటల్లో నేషనల్ బయో డైవర్సిటీ అథారిటీ, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిపుణుల కమిటీ (ఎక్స్ పర్ట్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అటవీ, బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు, జీవవైవిధ్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎర్ర చందనం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం, కొనుగోలు చేసిన వారి నుంచి వసూలు చేయాల్సిన 5 శాతం నిధులు, అంతేకాకుండా అటవీ ఉత్పత్తులను ట్రేడింగ్ చేసే వ్యాపారుల నుంచి 2, 3 శాతం నిధుల వసూలుపై చర్చించినట్లు సమాచారం. ఎర్రచందనం వేలం, రైతులు సాగు చేస్తున్న ఎర్రచందనం అమ్మకాల విధి విధానాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ నిపుణుల కమిటీ సమావేశం శనివారం కూడా జరగనుంది.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తులకు తుది గడువు నేడు

తిరుపతి అర్బన్ : డీఎస్సీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కోచింగ్ సదుపాయం పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి శనివారం వరకు గడువు ఉందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో దరఖాస్తు చేసుకున్న వాటిని పరిగణలోకి తీసుకుంటున్నామని వెల్లడించారు. దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన అభ్యర్థులు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బీసీలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి వీలుందని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జోత్స్న తెలిపారు. 10వ తేదీ నుంచి కలెక్టరేట్‌లోని బీ బ్లాక్ మూడో అంతస్తులోని తమ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.

మబ్బుల కొండ


శేషాచలాన్ని కప్పేసిన మబ్బులు





పగలు భగభగలు.. రాత్రి కాస్త మంచు వెరసి వేసవి ఛాయలు అప్పుడే తలుపు తట్టాయి. వీటికి తోడు గత రెండు రోజులుగా తిరుమల ఘాట్ రోడ్లల్లో మబ్బులు దట్టంగా కమ్మేస్తున్నాయి. ఎక్కడో ఊటి, కశ్మీర్‌లో ఉన్న అనుభూతిని కలిగిస్తున్నాయి. తిరుమలకు వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి మర్చిపోలేని అనుభూతిని పంచుతున్నాయి. ప్రకృతి ప్రేమికులు ఘాట్ రోడ్లల్లో మబ్బుల అందాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

– తిరుమల

హోలీ..రంగోళి


తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడు కండ్రిగలో రంగుల్లో మునిగితేలుతున్న ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు – బుచ్చినాయుడుకండ్రిగ

- తిరుపతి రూరల్‌కు చెందిన సావిత్రమ్మ ఇటీవల తిరుపతి నగరంలోని ఓ ప్రముఖ జ్యువెలరీ దుకాణంలో 16.57 గ్రాముల బొందు చైన్ కొనుగోలు చేసింది. దుకాణం యజమాని 16.57 గ్రాముల విలువతో కూడిన రసీదును అందజేశారు. రెండు నెలల తర్వాత ఇంటి అవసరాల నిమిత్తం దగ్గర్లోని ఓ కుదువ వ్యాపారి దగ్గరకు వెళ్లింది. వ్యాపారి చైన్ బరువును పరిశీలించగా 15.25 గ్రాములు మాత్రమే ఉందని చెప్పడంతో అవాక్కయ్యింది. కొనుగోలు చేసిన రసీదుతో బంగారు దుకాణానికి వెళ్లి నిలదీసింది. తమకు సంబంధం లేదని వెయిట్ ప్రకారమే బిల్లింగ్ వేశామని సిబ్బంది వాదనకు దిగారు. ఆరు నెలల తర్వాత ఇప్పుడు వస్తే ఎలా అంటూ తిరగబడ్డారు. చేసేదిలేక ఆమె ఇంటి ముఖం పట్టారు.
- తిరుపతి మంగళం ప్రాంతానికి చెందిన రమేష్ ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో 25 కేజీల రైస్ బస్తా రూ.1,350కు కొనుగోలు చేశాడు. డబ్బు చెల్లించాక రైస్ బస్తాను బండిపైకి తీసుకొచ్చాడు. బరువులో వ్యత్యాసాన్ని గుర్తించి తూకం వేయాలని దుకాణ యజమానిని అడిగాడు. వెయిట్ మిషన్‌పై బస్తాను ఉంచగా కేవలం 23 కేజీలు చూపించింది. దీనిపై వినియోగదారుడు నిలదీయగా.. వ్యాపారి దాటవేత ధోరణితో వ్యవహరించాడు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వెనుదిరిగాడు.



తూకమేస్తే.. అడ్డుకుందాం!

ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. ఇలాంటివి జిల్లాలో నిత్యకృత్యం. కూరగాయల నుంచి బంగారం వరకు తూకాలు, నాణ్యతలో నిలువునా మోసం చేస్తున్నారు. ప్రతి వస్తువునూ కల్తీమయం చేసి వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక పలువురు నలిగిపోతున్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- తూనికలు, కొలతల్లో మాయాజాలం
- ప్రతిదీ కల్తీ మయం
- బెంబేలెత్తుతున్న సామాన్య జనం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

తిరుపతి తుడా/ తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా జనాభా 28 లక్షలు. తిరుపతి నగరంలో 4.5 లక్షల మంది నివసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బంగారు దుకాణాలు వెలిశాయి. రోజూ కోట్లల్లో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. తూనికలు కొలతల నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. అన్నింటిలో కల్తీ జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు.

అంతా కల్తీమయమేనా?
తాగే పాలు నుంచి వంట నూనె వరకు ప్రతిదీ కల్తీమయంగా మారిపోయింది. పప్పు దినుసులు, కారం, మసాల పొడులు, వంట నూనె సైతం కల్తీ అవుతోంది. పాలల్లో నీళ్లు, పిండి పదార్థాలు, యూరియా, వనస్పతి వంటివి కలిపేస్తున్నారు. వనస్పతి ఉడకపెట్టిన బంగాళదుంప గుజ్జు, జంతువుల కొవ్వును నెయ్యిలో కలిపి విక్రయిస్తున్నారు. వంట నూనెలో నిషేధిత రంగులో వినియోగిస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. తేనెలోనూ పంచదార పాకం కలిపేస్తున్నారు. స్వీట్ల తయారీలో వాడే పంచదార, శనగపిండి ఇతర పప్పు దినుసుల పొడులు స్వీట్లపై చల్లే వెండిపొర, కుంకుమ పువ్వులు సైతం కల్తీ అవుతున్నాయి.

జిల్లాలో ప్రధాన దుకాణాల వివరాలు

బంగారం	186
మార్కెట్లు, రైతు బజార్లు	307
మాంసం దుకాణాలు	1,076
షాపింగ్ మాల్స్	257
చిల్లర కొట్లు	3076
టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్	2,065
ఎలక్ట్రానిక్ పరికరాలు	380
చౌకదుకాణాలు	1,457
నిత్యావసరాల దుకాణాలు	1,280
మద్యం షాపులు	42
పెట్రోల్ బంకులు	162
ఐరన్, స్టీల్	540
పాలదుకాణాలు	209
ఫుట్‌పాత్ విక్రయదుకాణాలు	4,752
హోటళ్లు	6,753

వినియోగదారుడా... మేలుకో..

- సీల్డ్ ప్యాకెట్ కొనుగోలు చేసే క్రమంలో తయారీ తేదీ, గడువు తేదీ, తయారీ సంస్థ చిరునామా, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ ఉందో లేదో గమనించాలి.
- వస్తువుల ప్యాకేజీపై ముద్రించిన బరువు కచ్చితంగా ఉందో లేదో ఎలక్ట్రానిక్ కాటాలో సరిచూసుకోవాలి
- తూనిక రాయి అడుగు భాగాన ముద్రిత సంవత్సరం, విభాగం, ఇన్‌స్పెక్టర్ సంఖ్య ఉన్నాయో లేదో చూడాలి
- ఎలక్ట్రానిక్ కాటా ప్రామాణిక తూకం రాళ్లను ఉంచి సరిగా పనిచేస్తోందో లేదో గమనించాలి
- ఎలక్ట్రానిక్ కాటాపై ఉన్న ఏ బటన్ నొక్కినా తేడా కనిపించకూడదు.
- ప్యాకేజీలు ఆకర్షణీయంగా ఉన్నంత మాత్రాన నాణ్యమైన సరుకులని భావిస్తే పొరపాటే
- ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్, 50 శాతం డిస్కౌంట్ అంటూ ప్రకటనలు చూసి మోసపోవద్దు, జంబో సైజు, ఎకానమీ సైజ్ వస్తువులు కొనుగోలులోనూ అప్రమత్తంగా ఉండాలి

తూనికల్లో కనికట్టు..
వ్యాపారికి మేలు జరిగేటట్టు



తూనికలు, కొలతల్లో భారీగా మోసాలు చోటు చేసుకుంటున్నాయి. తూనిక రాయి అడుగు భాగాన సీల్ వేసేందుకు 50 గ్రాముల నుంచి వంద గ్రాముల బరువు పట్టే రంధ్రం ఉంటుంది. చాలామంది తూనిక రాయి అడుగు భాగాన ఐస్కాంతం, ఇనుము అమర్చి మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలో కాటా స్క్రీన్‌లో జీరోలు వచ్చేలా సరి చూసుకోవాలి. కంపెనీల నుంచి వచ్చే కొన్ని ప్యాకెట్ల బరువుల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. బియ్యం మిల్లులు, ఎరువుల దుకాణాలు, సిమెంట్ బస్తాల్లోనూ కనికట్టు రాజ్యమేలుతోంది.

బంగారం కొంటున్నారా..
జాగ్రత్త సుమా!



ఆభరణాల్లో రాళ్లకు బంగారానికి వేర్వేరుగా తూకం వేస్తున్నారా లేదా గమనించాలి. చెల్లించిన సొమ్ముకు సరిపడా తూకం గల బంగారు ఆభరణాలు అందుతున్నాయో లేదో సూక్ష్మమైన తూనిక యంత్రంపై సరి చూసుకోవాలి. బంగారం నగల రసీదులో స్వచ్ఛత (క్యారెటేజ్) తెలియజేశారా..? అని ఆరా తీయాలి. రసీదులో స్వచ్ఛతకు అనుగుణంగా బంగారం గ్రాము ధర ఉందో లేదో చూడాలి. బంగారు నగలు తూచే ఎలక్ట్రానిక్ కాటాపై తూనికలు కొలతల శాఖ సీలు ఉందో లేదో పరిశీలించాలి.

గ్యాసు..మోసమే బాసు



గ్యాస్ సిలీండర్లపై ముద్రితమైన బరువు తప్ప వాస్తవంగా ఎంత ఉందో చాలా మందికి అంచనా ఉండదు. వినియోగదారుని ఎదుట బరువు తూచాకే గ్యాస్ సిలిండర్‌ను అందించాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ప్లాంట్ స్థాయి నుంచే మోసాలు జరుగుతున్నాయి. అలాగే పెట్రోల్, డీజిల్ నింపడానికి ముందు మీటర్ రీడింగ్ జీరో.. ఉందో లేదో గమనించాలి. బంకు సిబ్బంది మాటల్లో దింపి దృష్టి మరల్చి రీడింగ్ జంప్ చేయడానికి ప్రయత్నించే అవకాశం ఉంటుంది. అనుమానం వస్తే పెట్రోల్ బంకులోని ముద్రతో ఉన్న ఐదు లీటర్ల పరిమాణం గల కొలత పాత్ర ద్వారా సరిచూసుకోవచ్చు. ఇంధనం నాణ్యతమీద అనుమానం ఉంటే బంకు దగ్గర ఉన్న ఫిల్టర్ పేపర్ తీసుకుని పరిశీలించాలి.

మోసం..వారి నైజం



జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో వ్యాపారులు మోసం చేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. కూరగాయల మార్కెట్లలో తూనికల్లో నిలువునా మోసం చేస్తున్నారు. తూతూమంత్రంగా అధికారులు తనిఖీ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు.
–రమణమ్మ, గృహిణి, తిరుపతి

అవగాహన లేకనే



ప్రజలకు తూనికలు, కొలతలపై పూర్తిగా అవగాహన లేదు. దాదాపు రోజుకు 80శాతం మంది వినియోగదారులు వ్యాపారుల జిమ్మిక్కులకు బలవుతున్నారు. వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా స్పందించాలి. చట్టాలపై అవగాహన కల్పించాలి.
–చంద్రశేఖర్, రిటైర్డ్ ఉద్యోగి, మంగళం, తిరుపతి

కఠినంగా వ్యవహరించాలి



మార్కెట్లోని ప్రతి పదార్థం కల్తీ మయంగా మారింది. కారం, దనియాల పొడి, పసుపు, నూనెతో సహా అన్నీ కల్తీ అవుతున్నాయి. వీటిపై నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడు ఏం ముంచుకొస్తుందోనని భయపడాల్సి వస్తోంది. ఇలాంటి వాటిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి.
–కే. గంగాదేవి, తిరుపతి

తూనికల్లో తేడాలు



మార్కెట్లో నిత్యవసర కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా తూనికలు కొలతల్లో తేడాలు ఉంటున్నాయి. బియ్యం బస్తాల్లో రెండు మూడు కిలోలు తక్కువగా వస్తున్నాయి. దీనిపై ఎవరిని అడగాలో తెలియడంలేదు. వ్యాపారుల నడిగితే మాకు తెలియదంటున్నారు. నిత్యం దాడులు నిర్వహిస్తే వినియోగదారులకు న్యాయం జరుగుతుంది.
–జి.సురేంద్ర, తిరుపతి

నాణ్యతపై ప్రత్యేక దృష్టి



ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆధ్యాత్మిక నగరం నేపథ్యంలో తిరుపతిలో పదేపదే తనిఖీలు చేస్తున్నారు. చిన్నపాటి తప్పులు చోటుచేసుకున్నా కేసులు నమోదు చేస్తున్నాం. ప్రముఖ హోటల్స్ సైతం సీజ్ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.
–మద్దిలేటి, ఫుడ్‌సేఫ్టీ అధికారి, తిరుపతి

ఇసుకాసురుల 'కూటమి'!

- జిల్లాలో ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు
- రెండో దశలో గుర్తించిన ఇసుక రీచ్‌ల్లోనూ ఇబ్బడిముబ్బడిగా తవ్వకాలు
- పక్కాగా అమలయ్యేనాటికి అక్కడ ఇసుక ఉంటుందో లేదో?


కొత్త పాయింట్ అయిన గూడలి నుంచి ఇటీవల ఇసుకను తరలిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్: ఉచిత ఇసుక మాటున కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో చెడుగుడు ఆడుతోంది. గత ఏడాది జూలై 8న రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో నామమాత్రంగా ఒక నెల మాత్రమే ఇసుక పంపిణీ చేసి చేతులు పైకెత్తేసింది. గత ఏడాది సెప్టెంబర్ 8 నుంచి ఇసుక లేక రీచ్‌లను మూత వేసింది. రెండు నెలల క్రితం గాజులమండ్యం, అవిలాల, కాటన్ మిల్ వద్ద ఇసుక యార్డ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. వారు అన్నమయ్య జిల్లాలో ఇసుకను కొనుగోలు చేసి జిల్లాలో విక్రయాలు చేస్తున్నారు.

రెండో దఫా దోపిడీకి సిద్ధం

రెండో దఫా ఇసుక పాలసీని రేపో మాపో జిల్లాలో మొదలు పెట్టనున్నారు. గూడూరు ప్రాంతంలోని గూడలి సమీపం వద్ద ఒక పాయింట్, పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద రెండు ఇసుక పాయింట్లు గుర్తించారు. ఈ మూడు పాయింట్లలో 1,37,686 టన్నుల ఇసుక ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఇప్పటికే ఆయా పాయింట్ల వద్ద ఇసుక ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారు. ప్రధానంగా ఎగువ కలవకూరు– దిగువ కలవకూరు మధ్యలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా టీడీపీ నేతలు ఇసుక తరలించేస్తున్నారు. గూడలి పాయింట్ వద్ద ఉన్న ఇసుకలోనూ 50 శాతం ఇప్పటికే కూటమి నేతలు తరలించినట్లు తెలుస్తోంది. అధికారికంగా అమలయ్యే నాటికి అక్కడ ఇసుక ఉంటుందోలేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేటు ఏజెన్సీకి తవ్వకాల బాధ్యత

ఓ ప్రైవేటు ఏజెన్సీకి కొత్తగా ఏర్పాటు చేయనున్న మూడు ఇసుక పాయింట్లలో తవ్వకాల బాధ్యతను అప్పగించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న మూడు ఇసుక పాయింట్లలో ఒక టన్ను ఇసుకకు ఎంత చెల్లించాలో స్పష్టత లేదు. గతంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఇసుక పాలసీలో టన్ను ధర వెంకటగిరి మొగళ్లగుంట వద్ద రూ.590 చెల్లించాల్సి ఉండేది. అయితే ఏజెన్సీ పాత్ర ఏంటో స్పష్టంగా తెలియడం లేదు.

వైజ్ఞానిక భాండాగారం వేదిక్ వర్సిటీ


వర్సిటీని సందర్శించిన సీసీఆర్‌ఏఎస్ డైరెక్టర్, బృందం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వేదిక్ వర్సిటీ విజ్ఞాన భాండాగారమని ఢిల్లీకి చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ ఆయుర్వేదిక్ సైన్స్ డైరెక్టర్ జనరల్ నారాయణం శ్రీకాంత్ కొనియాడారు. శుక్రవారం ఆయన ఏపీ సీసీఆర్‌ఏఎస్ అధ్యక్షులు గోలి పెంచలప్రసాద్, బండి వెంకటేశ్వర్లుతో కలసి వేదిక్ వర్సిటీని సందర్శించారు. త్వరలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, అధికారులు, అధ్యాపకులు సందర్శకులను సత్కరించారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపల్, డీఎం హరిబాబు

తిరుపతి అర్బన్: అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 32వ బ్యాచ్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, అలిపిరి డిపో మేనేజర్ సింగంహరిబాబు తెలిపారు. అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తి చేసుకున్న 31వ బ్యాచ్‌కి సర్టిఫికేట్స్ అందించి వీడ్కోలు పలికారు. వారికి శిక్షణ పూర్తి చేసిన సర్టిఫికేట్స్‌ను అందించారు. అలాగే 32వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌తోపాటు మెకానిజంలోనూ పట్టుసాధించేలా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 496 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. 32వ బ్యాచ్‌ను శుక్రవారం ప్రారంభించామని చెప్పారు. ఈ నెల 20 నుంచి 33 బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

వివాహ వేడుకకు వెళ్తూ..



మృతదేహాన్ని నాయుడుపేటకు తరలిస్తున్న పోలీసులు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి, పెన్నేపల్లి గ్రామ సమీపాన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రదీప్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నాగరాజు కథనం.. కర్ణాటక రాష్ట్రం, ఓసూరు ప్రాంతానికి చెందిన ప్రదీప్ విజయవాడలో జరగనున్న ఓ వివాహానికి హాజరయ్యేందుకు మోటారు బైక్‌లో వెళుతున్నాడు. మార్గ మధ్యంలో పెన్నేపల్లి గ్రామ సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ప్రదీప్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన ఓ బీటెక్ విద్యార్థి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.5.39 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. పేరూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్న ఉద్యోగం కంటే బెటర్ జాబ్ చూసుకుని కొత్త కంపెనీకి మారాలనే ఉద్దేశంతో ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోమ్ చేస్తుండగా, 2024 డిసెంబర్ 29న టెలిగ్రామ్ ద్వారా ఓ సందేశం అతని ఫోన్ నెంబర్‌కు అందింది. పార్ట్ టైం జాబ్ పేరుతో ఉన్న ఆ మెసేజ్‌లో ఉన్న లింక్ ఓపెన్ చేయగా, హోటళ్లకు స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా డబ్బు సంపాదించొచ్చు అని పేర్కొన్నారు. బాధితుడు సూచించిన విధంగా పని చేయగా, మొదట రూ.700 అతని ఖాతాలో జమైంది. స్థిరమైన ఉద్యోగం కావాలంటే ముందుగా డబ్బు జమ చేయాలని చెప్పి మోసగాళ్లు చెప్పిన 12 బ్యాంక్ ఖాతాల్లో రూ.5.39 లక్షలను సదరు ఉద్యోగి జమ చేశాడు. అయినా సరే వంద పాయింట్లు పూర్తి కాలేదని, మరింత డబ్బు జమ చేయాలని నేరగాళ్లు ఒత్తిడి చేయడంతో మోసపోయినట్లు బాధితుడు గ్రహించాడు. వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఫలప్రదం.. విని'యోగం'!

- కొనుగోలుదారుల చేతిలో పాశుపతాస్త్రం వినియోగదారుల చట్టం
- మోసపోయి ఆశ్రయిస్తే చాలు..
- వస్తువులు, సేవల కేసుల పరిష్కారంలో ప్రధాన పాత్ర

తిరుపతి లీగల్ : వినియోగదారుల చేతిలో పాశుపతాస్త్రంగా వినియోగదారుల హక్కుల చట్టం పని చేస్తోంది. లోప భూయిష్టమైన వస్తువులు, సేవల నుంచి రక్షణ కల్పిస్తోంది. మోసపోయిన బాధితులను అక్కున చేర్చుకుంటోంది. వారికి న్యాయం చేకూర్చి బాసటగా నిలుస్తోంది. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కమిషన్ పనితీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

వినియోగదారులు ఎవరంటే?

ఏదైనా వస్తువు, సేవలను ఉపయోగించుకునే వాళ్లు వినియోగదారులే. పది రూపాయలు వెచ్చించి ఏదైనా వస్తువు కొనుగోలుచేసినా, ఏదైనా ఒక సేవ పొందినా వాళ్లు వినియోగదారుల కిందకే వస్తారు. కొన్న వస్తువు సరిగా పనిచేయకపోయినా, పొందిన సేవలో లోపం ఉన్నా ఆ వ్యక్తి వినియోగదారుల కమిషన్ మెట్లెక్కవచ్చు. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా న్యాయం జరుగుతుంది. చిత్తూరు నగరంలోని జిల్లా కోర్టు భవనాల సముదాయంలో జిల్లా వినియోగదారుల కమిషన్ ఉంది.

వినియోగదారుల హక్కులు

- వినియోగదారుల ప్రాణ, ఆస్తులకు హాని కలిగించే వస్తువులను మార్కెట్లో విక్రయించకుండా నిరసించే హక్కు
- కొనదల్చుకున్న వస్తువు విలువ, పరిమాణం, స్వచ్ఛత తెలుసుకునే హక్కు
- వస్తువులను దాని విలువ ముందుగా పరిశీలించుకునే హక్కు
- తనకు నచ్చిన వస్తువును కొనుగోలు చేసే హక్కు
- ఆరోగ్యకరమైన పరిసరాలకు సంబంధించిన హక్కు
- హక్కులకు భంగం కలిగినప్పుడు పరిహారం పొందే హక్కు



చిరునామా

తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తిరుపతి ఎంఆర్ పల్లి సర్కిల్ సమీపంలోని అద్దె భవనంలో ఉంది

చట్టం పుట్టుక ఇలా..

వినియోగదారుల సంరక్షణ కోసం 1962 మార్చి 15న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెనడి ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1983 నుంచి మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. భారతదేశంలో 1986 డిసెంబర్ 24న ఈ చట్టానికి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం 1988 నుంచి అమల్లోకి వచ్చింది.

ఫిర్యాదు చేయడం ఇలా..!

వివాద పరిహారం రూ.50 లక్షలకు లోబడి ఉన్నప్పుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేయాలి. బాధితుడు నేరుగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఫిర్యాదు చేసుకోవచ్చు. కాల పరిమితి సంఘటన జరిగిన రెండేళ్ల లోపు ఉండాలి.

చెల్లించాల్సిన ఫీజు

వినియోగదారుల కమిషన్‌లో పరిహారం విలువ ఐదు లక్షల రూపాయల లోపు అయితే ఎటువంటి ఫీజు ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం లేదు. ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు రూ.200, 10 లక్షల నుంచి 20 లక్షల వరకు రూ.400, 20 లక్షల నుంచి 50 లక్షల వరకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలి.

జరిమానాతో పాటు శిక్ష

వినియోగదారుల కమిషన్ తీర్పులను అమలు పరచని ప్రతివాదికి నెలకు తక్కువ కాకుండా మూడేళ్ల వరకు శిక్ష లేదా జరిమానా రూ.2 వేల నుంచి రూ.పది వేల వరకు పడుతుంది. లేదా శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది.

బ్యాంకు రుణం చెల్లించేలా

నా భర్త గజేంద్రన్ యూనియన్ బ్యాంకులో రూ.10 లక్షలు రుణం తీసుకున్నాడు. దానికి గాను ఓ బీమా కంపెనీ సంపూర్ణ రుణ సురక్ష పాలసీని ఇచ్చింది. తర్వాత నా భర్త నాలుగు నెలలకే మృతి చెందాడు. దీనిపై బీమా సంస్థను పాలసీ విషయంపై ప్రశ్నించగా వారు స్పందించలేదు. దీంతో కమిషన్‌లో ఫిర్యాదు చేయగా న్యాయం జరిగింది.
-కేజీ పావన సుధా, శ్రీనగర్ కాలనీ, తిమ్మినాయుడుపాళెం

విద్యుత్ శాఖపై విజయం



మా ఆవుపై విద్యుత్ తీగ తెగి పడింది. ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే స్పందించలేదు. తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాను. కమిషన్ ఆవు విలువ రూ.75 వేలు, నష్టపరిహారం కింద మరో రూ.50 వేలు విద్యుత్ శాఖ చెల్లించాలని తీర్పు చెప్పింది.
– జీ.సుబ్రహ్మణ్యం, కరకంబాడి, రేణిగుంట మండలం

చికిత్స ఖర్చులు చెల్లించేలా..



నాకు మూత్రపిండాల్లో రాయి ఏర్పడడంతో దాన్ని తొలగించేందుకు వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందాను. చికిత్సకయ్యే ఖర్చును చెల్లించాలని హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సంస్థను కోరాను. అయితే అధికారులు స్పందించ లేదు. దీనిపై కమిషన్‌లో ఫిర్యాదు చేశాను. నా చికిత్స ఖర్చు రూ.1,03,700 చెల్లించాలని తీర్పు చెప్పింది. -ఎల్.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయనగర్, తిరుపతి

రసీదు తీసుకోవాలి



మార్కెట్లో వస్తువుల కొనుగోలు ఇతరత్రా సేవలు పొందినప్పుడు వినియోగదారుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. మోసపోయినట్లు గుర్తిస్తే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఎంఆర్‌పీ కన్న ఎక్కువ వసూలు చేయకూడదు. ఎంఆర్‌పీ మీద దుకాణదారు మళ్లీ ధరను ముద్రించడానికి వీల్లేదు. అది నేరం.
– జీ.గురు ప్రసాద్ సీనియర్ న్యాయవాది

అవగాహన అవసరం



వినియోగదారులకు రక్షణగా ఉన్న హక్కులు, చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో గత ఏడాది 200 కేసులకు పైగా పరిష్కరించాం. ప్రస్తుతం 100 కేసులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
– స్నేహలత, జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు, తిరుపతి

కర్రలతో ఇరువర్గాల దాడులు



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామనారాయణ, రవి

నాయుడుపేటటౌన్: కర్రలతో ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న రామనారాయణ, రవి కుటుంబాల మధ్య గతంలో గొడవలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే మరలా గురువారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో ఇరువార్గలకు చెందిన కుటుంబ సభ్యులు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో రామనారాయణ, రవికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు రాష్ట్ర మైనారిటీ విభాగం జోనల్ అధ్యక్షుడిగా షఫీ అహ్మద్ ఖాద్రీ, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శులుగా ఎస్‌డీ అబ్బాస్, మహీన్, మహ్మద్ మగ్దూం మొహిద్దీన్, రాష్ట్ర మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శులుగా షేక్ సర్దార్, నూర్, రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొప్పాల భాస్కర్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శిగా యుగంధర్ రెడ్డి నియమితులయ్యారు.

ఎస్వీయూలో జర్మనీ భాష అభ్యసన కేంద్రం!

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ×స్టడీ వింగ్స్ ఓవర్సీస్ సంస్థ సహకారంతో జర్మనీ భాష అభ్యసన కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉప కులపతి కార్యాలయంలో స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమావేశమయ్యారు. వీసీ మాట్లాడుతూ.. జర్మనీలో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీని కోసం వర్సిటీ నందు ×స్టడీ వింగ్స్ టు ఓవర్సీస్ట్ సంస్థ సహకారంతో జర్మనీ అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశం అనంతరం సంస్థ ప్రతినిధులు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధులు నరేంద్ర రెడ్డి, వల్లేరు సుకన్య, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



వీసీతో సమావేశమైన స్టడీ వింగ్స్ ప్రతినిధులు, విద్యార్థులు

నేడు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ర్యాలీ

తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం మూడో శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్టీఆర్ స్టేడియం నుంచి మహతీ వరకు ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ బ్యూరో, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ టూరిజం సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు 500 మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ర్యాలీలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్వీయూ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 51,148 మంది స్వామి వారిని దర్శించుకోగా 21,236 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భారీ స్కాంపై విచారణ



అక్రమంగా నిర్మించిన షెడ్డులో సోలార్ ప్యానల్ ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణం చేసిన షెడ్డుకు అధికారులు విద్యుత్ సోలార్ అమర్చడంపై అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రిలో స్వర్ణ నారావారిపల్లి క్లస్టర్‌లో భారీ స్కాం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తిరుపతి రూరల్ డీఈ రెడ్డెప్ప తన సిబ్బందితో కలసి ఏ.రంగంపేట సమీపంలోని నాగపట్ల వద్ద అక్రమ నిర్మాణం చేపట్టిన షెడ్డును పరిశీలించారు. షెడ్డులో ఎలాంటి నివాసం లేకపోయినా విద్యుత్ సోలార్‌ను అమర్చడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏ ప్రాదిపదికన షెడ్డుకు సోలార్‌ను అమర్చారంటూ అధికారులను నిలదీశారు. సోలార్ ఏర్పాటుకు షెడ్డు యజమానులు ఎలాంటి పత్రాలను అందజేశారంటూ ఆయన ఆరాతీశారు.

ఎర్రచందనం వేలం కంటే..

పుష్ప సినిమా ఆదాయమే ఎక్కువ

- మాజీ ఏపీసీసీఎఫ్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి మల్లికార్జునరావు




తిరుపతి మంగళం : ఎర్రచందనం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం కంటే స్మగ్లింగ్‌పై తీసిన పుష్ప–2 సినిమాకే ఎక్కువ ఆదాయం వచ్చిందని మాజీ ఏపీ సీసీఎఫ్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పి.మల్లికార్జునరావు తెలిపారు. తిరుపతిలోని మారస సరోవర్ హోటల్లో నేషనల్ బయో డైవర్సిటీ అథారిటీ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిపుణుల కమిటీ(ఎక్స్ వర్ట్ కమిటీ) సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఎర్రచందనం తోటలను పెంచకుండా అటవీశాఖ ఆదేశించాలన్నారు. రైతులు పెంచుతున్న ఎర్రచందనం వృక్షాలు శేషాచలం అడవుల్లోని చెట్ల నాణ్యత తరహాలో ఉండడం లేదన్నారు. స్మగ్లర్లు రైతులను అడ్డు పెట్టుకుని గేమ్ ఆడుతున్నట్టు సమాచారం ఉందన్నారు. అటవీశాఖ రైతులకు ఇచ్చే అనుమతి పత్రాలను స్మగ్లర్లు దక్కించుకుని దుర్వినియోగం చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. బయో డైవర్సిటీ సంరక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఎర్రచందనం ప్రాధాన్యతను గుర్తించకుండా, స్మగ్లింగ్‌పై పుష్పలాంటి సినిమా తీయడం సరైంది కాదన్నారు. ఎర్రచందనం వేలం ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం కంటే పుష్ప– 2 సినిమాకు వచ్చిన రూ.1,800 కోట్లే ఎక్కువని చెప్పారు.

ముగ్గురు అరెస్ట్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం, మేర్లపాక టోల్ ప్లాజా వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుడగా మేర్లపాక వైపు నుంచి ఏర్పేడు వైపు రాంగ్‌రూట్లో నిర్లక్ష్యంగా వేగంగా వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ జయచంద్ర తెలిపారు. ఈ మేరకు వారిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గరుడునిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న స్వామివారు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు శుక్రవారం గరుడ వాహనంపై విహరించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా కలాణోత్సవం జరిపించారు. అనంతరం కనులపండువగా ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణ ప్రారంభం

చంద్రగిరి : స్వర్ణ నారావారిపల్లె కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ సురేష్ బాబు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణం అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు వివరించారు. నారావారి పల్లె, కందులవారి పల్లె, భీమవరం, శేషాపురంలోని యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఈటీఐ సిబ్బంది సీతారామయ్య, మురళి, దిలీప్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

తడ: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీలోని ఐఐటీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కర్ణాటకకు చెందిన విద్యార్థి ప్రత్యూష్ ఎంఆర్ (21) మృతిచెందాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం.. హోలీ సంబరాల కోసం రంగులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రత్యూష్ కళాశాలకు చెందిన స్కూటీపై సూళ్లూరుపేట వెళ్లాడు. సరుకులు కొనుగోలు చేసి తిరుగు పయనంలో కొండూరు చెరువు వద్దకు వచ్చే సరికి వెనుక వచ్చిన లారీ స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రత్యూష్‌పై లారీ టైర్లు ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లారీ డ్రైవర్‌ను ఆదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మోటార్‌బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

కోట: మోటార్‌బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం కోట మండలం, చిట్టేడులో చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం... చిట్టేడుకు చెందిన వెంకయ్య(85) రోడ్డు దాటుతుండగా అన్నంబాక నుంచి చిట్టేడు వైపు వస్తున్న మోటార్‌బైక్ ఢీకొంది. వెంకయ్యను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుంతలు బాబోయ్!

- అధ్వాన్నంగా గ్రామీణ రహదారులు
- సంక్రాంతి గడువు దాటినా మోక్షం లేని రోడ్లు
- పల్లెలకు వెళ్లే బాటలన్నీ గతుకుల మయం
- ప్రధానంగా పీఎన్ పేట- శ్రీకాళహస్తి మార్గంలో తప్పని అవస్థలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సంక్రాంతి పండుగలోపు రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దుతామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించింది. ఇంతలో పండుగ రానే వచ్చింది. గ్రామాలకు వచ్చిన వారు తిరిగి పట్టణాలకు చేరుకున్నారు. అయినా రహదారులు మాత్రం బాగుపడలేదు. జిల్లాలో అక్కడక్కడ కొన్ని రహదారులకు కంకర, తారు అద్ది ఆ ఫొటోలను తమ అనుకూల పత్రికల్లో నాడు– నేడు అని ప్రచురించుకుని గొప్పలు చెప్పుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయమై అధ్వాన్నంగా మారాయి. ఆ మార్గంలో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. తరచూ ప్రమాదాల బారినపడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రేణిగుంట–పాపానాయుడుపేట రహదారిని సంక్రాంతికి ముందు హడావుడిగా వేశారు. బాగుచేసిన రహదారి దెబ్బతినకుండా.. ప్రమాదాలు జరుగకుండా రోడ్డు పటిష్టంగా ఉండేందుకు ఇరువైపులా గ్రావెల్ లేదా మట్టితో 'సైడ్ బర్మ్' ఏర్పాటు చేస్తారు. అయితే అటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న గుంతల్లో ఒరిగిపోయి ప్రమాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నరక ప్రయాణం

పాపానాయుడుపేట- శ్రీకాళహస్తి మార్గంలో పాడైన రహదారిని బాగుచేయాల్సింది పోయి.. దెబ్బతిన్న చోట్లంతా తవ్వేసి కంకరతో కప్పేశారు. శివరాత్రికి ముందు తవ్వేశారు. ఆ తరువాత తవ్వేసిన ప్రాంతాల్లో కంకరతో నింపేశారు. మరి కొన్ని చోట్ల గుంతలు ఉన్నా పూడ్చే కార్యక్రమం చేపట్టకలేదు. ఫలితంగా మర్రిమంద నుంచి ముసిలిపేడు వరకు సుమారు 10 కి.మీ నరకం కనిపిస్తోంది. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు కొందరు కంకర, గుంతల్లో పడిలేచి వెళ్లాల్సి వస్తోంది. గాజులమండ్యం సమీపంలోని ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి సూరప్పకశం, బ్రాహ్మణపట్టు వెళ్లే గ్రామీణ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఈ ప్రాంతంలో ప్రయాణం ప్రమాదంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రేణిగుంట మండలం జీ పాళెం వద్ద రోడ్డు దుస్థితి



శివరాత్రికి ముందు పాపానాయుడుపేట- శ్రీకాళహస్తి రహదారిలో గుంతలు ఏర్పడిన పలు ప్రాంతాల్లో ఇలా తవ్వేశారు



పాపానాయుడుపేట- శ్రీకాళహస్తి మార్గంలో అధ్వాన్నంగా ఉన్న రహదారి



తారురోడ్డు వేసినా.. ఇరువైపులా 'సైడ్ బర్మ్' ఏర్పాటు చేయకుండా వదిలేసిన రేణిగుంట-పాపానాయుడుపేట రహదారి